


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

బుధవారం | 19 | ఆగస్టు | 2026 | పేజీలు: 08




### ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు

# గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, అక్షిత ప్రతినిధి : హైదరాబాదులో రెండు రోజుల పాటు జరిగే ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభిస్తారు. మంగళవారం నాడు లోక భవన్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ కాంక్లేవ్ ప్రారంభ ఆహ్వాన విందుకు హాజరవుతానని ..మిగతా 2లో



# ప్రగతి పతాకగా నల్గొండ

### అన్ని రంగాల్లోనూ అభివృద్ధి

### నంబర్ వన్ కార్పొరేషన్‌గా నల్గొండ

### మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. ముందుగా మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి ..మిగతా 2లో

# రికార్డుల తారుమారు

### తీర్మానం లేకుండానే నిధుల వినియోగం

### గాజులపేట గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ

### రికార్డుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం గుర్తింపు

### పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ ..మిగతా 2లో

# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో: అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ ..మిగతా 2లో



### కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో

# పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కరీంనగర్ అక్షిత బ్యూరో: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20, 21వ డివిజన్లలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న పైప్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని ..మిగతా 2లో

## ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సుకు గవర్నర్‌కు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి...

గవర్నర్ తన అంగీకారం తెలిపారు. జాతీయస్థాయిలో మీడియా పోకడలు ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరుపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందేశం ఇస్తారు. ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్ .శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్ ని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా గవర్నర్ కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీని పాలక మండలి అందజేసింది. గవర్నర్ కు పూల మొక్కను అందజేసి సత్కరించారు. ఈనెల 21 తేదీన తాజ్ కృష్ణ హోటల్లో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందు కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. దేశం నలుమూలల నుంచి సీనియర్ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రెండు రోజుల సదస్సుకు హాజరవుతారు.

## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం 16వ డివిజన్‌లో 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయిన అనంతరం డివిజన్ ప్రజలకు మంచినీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు.

అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, బండ రమణారెడ్డి, వంగల పవన్, బండారి వేణు, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, ఆయా డివిజన్ల ప్రజలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రికార్డుల తారుమారు

మొదటి పేజీ తరువాయి...

చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే నిధులు వినియోగించినట్లు గుర్తించారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి చూపించిన కొన్ని తీర్మానాలు నకిలీవిగా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. రికార్డుల నిర్వహణకు సంబంధించిన పత్రాలు కూడా సక్రమంగా లేవని కలెక్టర్ గుర్తించారు. దీంతో గాజులపేట పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దోమల నివారణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్ల వివరాలు, వాటి సంఖ్య, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను కూడా ఆమె పరిశీలించారు. అనంతరం గాజులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏ పాఠ్యాంశం జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బయాలజీ చదువుతున్నామని తెలపగా, చదువు ఎలా సాగుతోంది. ఉపాధ్యాయులు పాఠాలను బాగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు.

పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రగతి పతాకగా నల్గొండ

మొదటి పేజీ తరువాయి...



వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయల తో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఆయా డివిజన్ లలో మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని, పట్టణానికి తాగినీటికై ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్ల రూపాయలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇదివరకే పట్టణంలో 125 కోట్ల రూపాయలతో 12 తాగునీటి ట్యాంకులు చేపట్టగా, అందులో ఒకటి పూర్తి అయిందని, డిసెంబర్ నాటికి తక్కిన 11 వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితాయని వెల్లడించారు. పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రధాన కాలనీలతో పాటు, శివారు గ్రామాలలో కూడా ఒక్కొక్కటి 3 కోట్ల రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమున్న చోట స్మశాన వాటికలు, దేవాలయాలు, చర్చిలు మసీదులను కట్టిస్తున్నామని, పట్టణానికి మొదటి విడత 700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అవసరమైతే మరిన్ని ఇండ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ నెల 15న గొల్లగూడ సమీపంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామని, నల్గొండను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. పట్టణంలో లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్ల రూపాయలతో రహదారులను మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని, అంతేకాక రోప్ వే కూడా ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ఛాయా సోమేశ్వర దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామని, పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సమస్యలు తీరుస్తామని, పట్టణానికి నడిబొడ్డున ఉన్న నాగార్జున కళాశాల బ్లాక్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, తెలంగాణలోనే మొదటి కళాశాలగా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు, మహిళా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేసేందుకు ఇటీవలే 3 కోట్ల రూపాయలతో పెట్రోల్ పంపును ప్రారంభించామని, 2 కోట్ల రూపాయలతో సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని, అంతేకాక మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గోదాముల నిర్వహణ, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి చేయిస్తున్నామని, సంఘంలో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పాటు కావాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు.

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకతీతంగా నల్గొండ కార్పొరేషన్ ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, పట్టణంలో రహదారుల ఏర్పాటుతో పాటు, డివైడర్లు ,సెంట్రల్ లైటింగ్, హైమాస్ లైటింగ్, సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభను తీసుకొస్తుందని అన్నారు.

కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి, కవిత, వేణు, తదితరులు మాట్లాడారు.

డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బిఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ నాగరత్నం, కార్పొరేటర్లు స్వాతి, కవిత, జాతీయ రహదారి అధికారులు, తదితరులు ఉన్నారు.

# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

మొదటి పేజీ తరువాయి...



మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్లు ఆకాష్, షాహిన్ సుల్తానా, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్ నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించడం జరిగిందని, అర్హులైన నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇద్దామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ కొరకు అధిక ప్రాథమిక ఇస్తుందని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పర్యాటకరంగ అభివృద్ధికి నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వట్టివాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికల్లో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతను పాటించడం జరుగుతుందని, ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరు అయితే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, గృహ నిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి అవసరాలకు అనుగుణంగా రైతులు

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార దీపక్




అక్షిత బ్యూరో, మంచిర్యాల : ఎల్ నినో నేపథ్యంలో రైతులు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలంలో గల గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భీమారం మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదిత భూమి, మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనం పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విలువైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే రీతిగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడి వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలు, పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సదానందం, ఆర్.ఐ. రజిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల కోసం పోరాటమే ఆయనకు నిజమైన నివాళి

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయమే బీసీల ఆత్మగౌరవం -ఆయన పోరాటమే మనకు స్ఫూర్తి: రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య



చిన్నంబావి, అక్షిత న్యూస్: చిన్నంబావి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కురువ చిన్న మల్లయ్య సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య మాట్లాడుతూ... సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు, మొఘల్ సామ్రాజ్యాన్ని ధిక్కరించి, దక్కన్‌లోని సామంత వ్యవస్థను సవాలు చేస్తూ ప్రజల కోసం వీరోచితంగా పోరాడిన మహోన్నత యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వీరత్వం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, మొఘల్, జాగీర్దార్లు, పెత్తందార్ల దోపిడీకి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన ఘనత పాపన్న గౌడ్‌కు దక్కిందన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల కోసం పోరాటమే ఆయనకు నిజమైన నివాళి,పాపన్న గౌడ్ ఆశయమే బీసీల ఆత్మగౌరవం–ఆయన పోరాటమే మనకు స్ఫూర్తి సామాజిక న్యాయం సాధించడమే సర్వాయి పాపన్న గౌడ్ లక్ష్యం అని రాష్ట్ర బీజేపీ నాయకుడు కురువ చిన్నమల్లయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని

# ఘనంగా నిర్వహించిన ఉద్యమకారులు



నారాయణ పేట,అక్షిత బ్యూరో: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం ఉద్యమకారుడు, నంది అవార్డు గ్రహీత కొత్తపల్లి నరేష్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ చరిత్రలో ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. ఔరంగజేబు పాలనకు ఎదురొడ్డి పోరాడిన యోధుడిగా, బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన దిశాలిగా పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.

దొరల అరాచకాలను, మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంత ప్రజల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. మహనీయుని జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ. మధుసూదన్ రెడ్డి,టి.రామ్ రెడ్డి, ఏ. బుచ్చిరెడ్డి, తులసి రామ్ నాయక్, టి. వెంకట్ రెడ్డి,రాము గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

### నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### బీసీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో వేడుకలు



అక్షిత రాజన్న సిరిసిల్ల: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

### తంగడ పల్లిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

### బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లోని తంగడపల్లి గ్రామ చౌరస్తా వద్ద మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలు, సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన బీసీ సమాజ్



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయం మహబూబ్ నగర్ వారి ఆధ్వర్యంలో పద్మావతి కాలంలోని గ్రీన్ బెల్ట్ కాలనీ దగ్గర నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో బీసీ సమాజ్ ,బీసీ జేఏసీ నాయకులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడని, ప్రజా నాయకుడు అని కొనియాడారు. సమాజంలో సమానత్వం,ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు..

నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల కోసం ఆ మహా యోధుడి ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్,బీసీ జేఏసీ నాయకులు సారంగి లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, బంద్రవల్లి మాజీ సర్పంచ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## 6వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి



**రామన్నపేట ఆగష్టు 18:** నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గతంలో ఎంపీటీసీలకు కేటాయించిన నిధులలో భాగంగా నీర్నేముల గ్రామంలోని 6వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పలమ్మ గుడి నుంచి నాగటి శంకరయ్య ఇంటి వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు 6వ వార్డు సభ్యులు ముత్యాల కిషన్ తెలిపారు. వార్డులో రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం బాధ్యతగా వ్యవహరించాలి

### అంకిరెడ్డిగూడెంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం...

### చౌటుప్పల్ ఎస్ఐ డి.నర్సిరెడ్డి



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** అంకిరెడ్డిగూడెం గ్రామంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ డి.నర్సిరెడ్డి గ్రామ ప్రజలు,యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై మంగళవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం తో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ముఖ్యంగా యువత చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, విద్య,ఉద్యోగం,క్రీడలు వంటి మంచి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో యువత,ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తకోట దయాకర్ రెడ్డి 73వ జయంతి ఘనంగా నిర్వహణ





**నారాయణ పేట,అక్షిత బ్యూరో:** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ శాసన సభ్యులు కొత్తకోట దయాకర్ రెడ్డి 73వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తకోట కుటుంబ సభ్యులు, మాజీ శాసనసభ్యులు సీతమ్మ, వారి కుమారుడు కొత్తకోట సిద్ధార్థ రెడ్డి, కోడలు నేహా రెడ్డి, అల్లుడు జగదభిరామిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తకోట దయాకర్ రెడ్డి చిత్రపటానికి మక్తల్, మాగనూర్, కృష్ణ, ఊట్కూర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి డి పి నాయకులు మధుసూదన్ రెడ్డి,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొని దయాకర్ రెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

### సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.సమాజంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం సామాజిక న్యాయం ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి జ్యోతి డాక్టర్ రాజశేఖర్ గౌడ్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి జానయ్య నాయకులు అమరగాని వెంకన్న గౌడ్ కత్తి నెహ్రూ గౌడ్ పోలంపల్లి నాగరాజు గౌడ్ బండి నాగేశ్వరరావు గౌడ్ గజ్జెల్లి వెంకన్న నూతి సత్యనారాయణ గౌడ్ వూడుగు శ్రీనివాస్ గౌడ్ బొలిగాని శ్రీనివాస్ గౌడ్ బిచ్చాల తిరుమలరావుగౌడ్ మారగాని సుదర్శన్ గౌడ్ బెల్లంకొండ శరత్ గౌడ్ మూడు ముంతల గంగరాజు గౌడ్ కొమిలి శ్రీనివాస్ గౌడ్ జి శ్రీనివాసరావు మార్కం లింగయ్య గౌడ్ దాసరి శ్రీరాములు గౌడ్ అల్లిక అంజయ్య పగడాల నాగరాజు గుడిద శ్రీనివాస్ వట్టికూటి ఉమాదేవి డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు రుద్ర ప్రదీప్ మొక్క శేఖర్ గౌడ్ షేక్ షకీనా బిసి కుల సంఘ నాయకులు వెనుకబడిన తరగతుల కార్యాలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ వైద్య కళాశాలలో ఘనంగా మెగా ప్లాంటేషన్ వన మహోత్సవం...

### విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** కాకతీయ వైద్య కళాశాల, వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో, కళాశాల యాజమాన్యం సహకారంతో కాకతీయ వైద్య కళాశాల ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే భావనతో మొక్కలను కాపాడితే అవే మనలను కాపాడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. పెద్ద సంఖ్యలో మొక్కలను ఉచితంగా అందించి కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖను అభినందించారు.

మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి బతికించడం అంతకంటే ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను కనీసం వచ్చే ఏడాది వరకు జాగ్రత్తగా సంరక్షిస్తే వాటి మనుగడ శాతం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

## ఉండేకారి మల్లయ్య భౌతికకాయానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు నివాళి





**అలంపూర్ , ఆగస్టు 18, అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉండేకారి మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అయిజలోని మల్లయ్య నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. మల్లయ్య మృతి పార్టీకి, అయిజ ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు. పార్టీ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిబద్ధతతో పనిచేశారని, మంచితనం, సేవాభావంతో అందరితో కలిసిమెలిసి ఉండేవారని గుర్తు చేశారు. మల్లయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. సీనియర్ నాయకుడిగా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మల్లయ్య ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటని, మల్లయ్య సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. మల్లయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం మల్లయ్య అంత్యక్రియల్లోనూ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపాలిటీ ఛైర్మన్ సీఎం సురేష్, వైస్ ఛైర్మన్ మాల నర్సింహులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## సామాజిక సమానత్వం కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన
# పోరాటం స్ఫూర్తిదాయకం

**బడుగు-బలహీన వర్గాల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో :** సామాజిక సమానత్వం, బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి పిలుపునిచ్చారు.

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆమె సూచించారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, హక్కులు లభించేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

సర్వాయి పాపన్న గౌడ్ జీవితం, ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఆయన చూపిన ధైర్యం, సామాజిక స్పృహ, సమానత్వ భావనలను నేటి తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సామరస్యం, సోదరభావం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేషరామ్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేష్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు మంగమ్మ, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎగ్గిడి సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి రవి గౌడ్, కసర మౌని కృష్ణ యాదవ్, శ్యామ శంకర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ సుధాకర్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలిగినంతలో ఇతరులకు సేవచేయాలి



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** మనకు కలిగినంతలో ఇతరులకు ఏదో ఒక రూపంలో సేవ చేయడం ద్వారా జీవితానికి సార్థకత ఏర్పడుతుందని దమ్మపేట మండల అభివృద్ధి అధికారి భీమిరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండల పరిధి లోగల గౌరిగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ యూనిట్ అధ్యక్షులు ఎస్.కేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నేత్రవైద్య పరీక్షా శిబిరం మరియు పేదవర్గాలకు నలభై వేల విలువగల క్యారేజీల పంపిణీ కార్యక్రమంలో రవీంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేశవరెడ్డి,సత్యవతి దంపతులు తమ మనుమడు గాదె ఇషాన్ రెడ్డి జన్మదిన సందర్భంగా గ్రామ ప్రజల కొరకు నేత్ర వైద్య శిబిరం, శ్రామికులకు క్యారేజీలు వితరణ చేయడం అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో గౌరిగూడెం సర్పంచ్ తోటకూరి అనూష శ్రీనివాసరావు,ఉపసర్పంచి పుచ్చకాయల స్వప్న సర్కారెడ్డి,గ్రామ పెద్దలు ముత్తారెడ్డి,బండి పిచ్చిరెడ్డి,ఏరువ సత్యనారాయణ రెడ్డి, దేవగిరి కేశవరెడ్డి, శరత్ మాక్స్ విజన్ నేత్ర వైద్యశాల సిబ్బంది విక్రమ్ సింగ్,భీష్మ ప్రియ, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఏ.యస్.ప్రకాశరావు, జి.కృష్ణయ్య, బోడేపూడి బాబు,బూరుగు దాసు,సాంబశివరెడ్డి, మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ బహూకరణ



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను బహూకరించారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు వెల్లంకి గ్రామ మాజీ ఎంపీటీసీ, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి వీటిని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిథిలావస్థకు చేరిన పాత గదుల స్థానంలో ఎమ్మెల్యే సహకారంతో నూతన గదులు మంజూరు చేయించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో శిథిలావస్థలో ఉన్న గదుల స్థానంలో రెండు అదనపు గదులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్‌పర్సన్ పులగం సులోచన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, మందుగుల వెంకటయ్య, ఇడెం స్వరూప సేవా ట్రస్ట్ చైర్మన్ ఇడెం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, నాయకులు గంజి నర్సింహా, భాస్కర్, చక్రపాణి, గోషిక కొండల్ రెడ్డి, కనుకుంట్ల భాస్కర్ రెడ్డి, ఎడ్ల సంజీవ రెడ్డి, రుద్ర వెంకటేష్, మిరియాల నరేశ్, మిరియాల వెంకటేష్, గోధుమల సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాంటిస్సోరి స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలి
# టీజీవీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ హరీష్ డిమాండ్



**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి:** తిరుమలగిరి మండల కేంద్రంలో ఉన్న స్థానిక మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యంపై, సదరు పాఠశాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర కోఆర్డినేటర్ హరీష్ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. మాంటిస్సోరి పాఠశాలలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని మండిపడ్డారు. పాఠశాల కింద గ్రోమోర్ ఉండటంతో పాటు, క్లాస్ రూముల్లో సరైన వెంటిలేషన్ (గాలి, వెలుతురు) లేకపోవడం శోచనీయమన్నారు. వీటికి తోడు బాత్రూమ్స్, టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కలుషిత వాతావరణం కారణంగా పాఠశాల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారని, శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలలోని సమస్యలపై గత జూన్ 14వ తేదీనే జిల్లా విద్యాశాఖాధికారి గారికి వినతిపత్రం సమర్పించామని హరీష్ గుర్తుచేశారు. ఆ సమయంలో డీఈఓ సానుకూలంగా స్పందించి, తిరుమలగిరి మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి తగిన ఆదేశాలు, నోటీసులు పంపినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. నోటీసులు అందినా కూడా స్థానిక ఎంఈఓ గారు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, సదరు మాంటిస్సోరి పాఠశాలకు తక్షణమే నోటీసులు జారీ చేసి, స్కూల్‌ను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు వినయ్, మోహన్, మహమ్మద్ పాషా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన 1వ వార్డు నివాసి చెల్లంపల్లి కృష్ణయ్య అనారోగ్యంతో బాధపడుతూ చనిపోవడం జరిగింది . విషయం తెలుసుకున్న సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మరియు బిఆర్ఎస్ నాయకులు సంయుక్తంగా 5500/- వేల రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్,ఉప సర్పంచ్ నిజాముద్దీన్, విజయ్ డైరీ అధ్యక్షుడు కంకల శ్రీశైలం, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్, పల్స అనురాధ జంగయ్య,మాజీ వార్డు సభ్యులు నరేష్ గౌడ్ , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిరాం మరియు కాశీరెడ్డి రాంరెడ్డి, క్రాంతి యువజన సంఘ సభ్యులు సహదేవ్, లింగమయ్య ,మల్లేశ్ మోటపురం రాములు,ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం






**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ. పుష్పలత, సహాయ అధికారి శంకరయ్యతో పాటు గౌడ కుల సంఘ నాయకులు చిర్ర రాజు గౌడ్, గట్టు రమేష్ గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అనంత రమేష్ గౌడ్, లక్ష్మణ్, జనగాం శ్రీనివాస్ గౌడ్ తదితరులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముఖ్య అతిథి ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఒక చరిత్ర అని పేర్కొన్నారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న గౌడ్ బహుజనుల కోసం పాలకులను ఎదిరించి, స్వరాజ్యాన్ని స్థాపించి ప్రజలకు సేవ చేశారని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సేవలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ కుల సంఘ నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో



సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని చెప్పారు. లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్పగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకునేందుకు అన్ని వనరులను సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. విద్య పూర్తికాకముందే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా తగిన అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్యూక్వైర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువగా టీజీ ఎన్పీడీసీఎల్

### ఏఐ వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా 24/7 సేవలు ... ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన

### ఉత్తమ్ జాడే ఎస్ ఈ

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోందని, వినియోగదారులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సమస్యలను ఇంటి నుంచే తెలియజేసి అవసరమైన సేవలను పొందేలా సంస్థ అనేక డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్, ఉత్తమ్ జాడే తెలిపారు.

ఇందులో భాగంగా 24 గంటలు, 7 రోజులు అందుబాటులో ఉండే వాట్సాప్ చాట్‌బాట్ సేవలను వినియోగించుకోవాలని వినియోగదారులను కోరారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సేవల వివరాలు, బిల్లింగ్, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్ తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు.

వాట్సాప్ చాట్‌బాట్ నంబర్: 87124 81489 ను వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా అందుబాటులో ఉన్న వివిధ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్, సోలార్ , కు సంబంధించిన సమాచారం తదితర సేవలను సులభంగా పొందవచ్చన్నారు.



విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 1912, ఏ ఐ వాట్సాప్ చాట్‌బాట్, మొబైల్ యాప్, వెబ్ సైట్ తదితర ఆధునిక సేవా మార్గాలను మరింత బలోపేతం చేసిందని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను నమోదు చేసి, వాటిని సంబంధిత అధికారులకు చేరవేయడంతో పాటు, పరిష్కార ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించే విధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

వినియోగదారుల సంతృప్తే సంస్థకు అత్యంత ప్రాధాన్యత అని ప్రతి విద్యుత్ వినియోగదారుడికి వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తున్నాం అని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ తెలిపారు.

విద్యుత్ వినియోగదారులు డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సులభంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సాంకేతికతతో సేవలు.. వేగవంతమైన స్పందనతో పరిష్కారం.. వినియోగదారుల సంతృప్తే టీజీ ఎన్పీడీసీఎల్ లక్ష్యం" అని స్పష్టం చేశారు.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సాధన కోసం పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెలిశాల ఎక్స్ రోడ్‌లో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన బహుజన ఆత్మగౌరవ ప్రతీక, విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు తిరుమలగిరి మండల కేంద్రం పరిధిలోని వెలిశాల గ్రామపంచాయతీ ఎక్స్ రోడ్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో మొదటగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు సుంకరి జనార్ధన్ మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాల రాజ్యాధికారం కోసం, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బహుజనుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని, ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు.



అనంతరం వెలిశాల గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. ఆనాటి భూస్వామ్య దౌర్జన్యాలు, అణచివేతలపై సింహంలా ఎదురొడ్డి నిలిచిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలబెట్టిన ఆయన వీరత్వం, చరిత్ర నేటి యువతకు, భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. పాపన్న గౌడ్ ఆశయాలను గ్రామస్థాయిలో ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మి లాల్ నాయక్, మున్సిపాలిటీ కౌన్సిలర్ తిరుమణి యాదగిరి, తుంగతుర్తి నియోజకవర్గం మీడియా కన్వీనర్ కందుకూరి లక్ష్మయ్య పాల్గొన్నారు. అలాగే వార్డు మెంబర్ మరిగాడుదుల వెంకన్న (రవ్వ లడ్డు), మాజీ కౌన్సిలర్ భాస్కర్ నాయక్, గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

# బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, వారి జీవిత చరిత్ర నేటి తరాలకు ఆదర్శనీయమని జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, గౌడ సంఘాల నాయకులు, బి.సి. సంఘాల నాయకులతో కలిసి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి అప్పటి మొగల్ పాలకుల అరాచకాలను ఎదిరించి గోలుగొండ పాలించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. పాలకులకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన ప్రజలకు అండగా నిలిచారని, ప్రతి ఒక్కరు పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల నాయకులు తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, గౌడ సంఘాల ప్రతినిధులు బాలేశ్వర్ గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్, కొండ్ర మనోహర్ గౌడ్, మార్క శంకర్ గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు నీరజ గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం పీహెచ్‌సీ పనులు వేగవంతం చేయాలి



**మానకొండూర్ అక్షిత న్యూస్:** గన్నేరువరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భవనంలోని అన్ని గదులను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గన్నేరువరం మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని సౌకర్యాలతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైద్యులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణం చేపట్టాలని అన్నారు.

ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి కృష్ణ, కొమ్మెర రవీందర్ రెడ్డి, పరిపూర్ణచారి, తిరుపతి తదితరులు ఉన్నారు.

# సామాజిక న్యాయం, సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం చిరస్మరణీయం

### జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను

**నారాయణ పేట,అక్షిత బ్యూరో:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు.

మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి





నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించే దిశగా ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్.డీ సీ రాజేందర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న, గౌడ సంఘం నాయకులు సతీష్ గౌడ్, రఘురామయ్య, వెంకటేష్, గుర్నాథ్, కలాల్ ఆనంద్ గౌడ్, సర్పంచి శేఖర్ గౌడ్, ఉట్కూర్ మండలానికి చెందిన గౌడ సంఘం నాయకులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఫరూఖ్‌నగర్: తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఫరూఖ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి, బహుజనుల ఆత్మగౌరవం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్. కొత్తూరు గోవర్ధన్ గౌడ్.తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు. గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## తట్టుగూడ వాగు మీద హై లెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** కాగజ్ నగర్ మండలం అంకు సాపూర్ మరియు తట్టుగూడెం మధ్య రూ. 8.5 కోట్ల అంచనా తో మంజూరైన హై లెవెల్ వంతెన నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో కాగజ్ నగర్ మరియు వాంకిడి మండలా ల మధ్యలో దూర భారం తగ్గి అనుసంధానం ఏర్పడనుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు , ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ హరిత, అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ కృష్ణయ్య ,ఆర్ అండ్ బి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

### హోరాహోరీగా సాగిన ఇచ్చోడ ప్రెస్ క్లబ్ ఎన్నికలు

### బ్యాలెట్ పద్ధతిలో నూతన కార్యవర్గం ఎంపిక

### అధ్యక్షుడిగా కొత్తూరి లక్ష్మణ్ విజయం




**ఇచ్చోడ, అక్షిత న్యూస్:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో మంగళవారం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పోటీకి ముగ్గురు బరిలో ఉండటంతో ఉత్కంఠగా, హోరా హోరీగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవి కోసం కొత్తూరిలక్ష్మణ్, అన్నేల లక్ష్మణ్, మేడపట్ల సాయన్న ముగ్గురూ పోటీ పడగా, సభ్యులు ప్రజాస్వామ్య బద్ధంగా బ్యాలెట్ పద్ధతి ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కొత్తూరు లక్ష్మణ్ అత్యధిక ఓట్లతో ఘన విజయం సాధించారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**


అధ్యక్షులుగా కొత్తూరి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సిరి గిరి శ్రీనివాస్, ఎం.ఎ. జాకీర్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ అజయ్, గౌరవ సలహాదారులు: నరాల రమణయ్య, మాధవ్, రవూఫ్ ఖాన్, ఎన్నికయ్యారు. ఈ సందర్భం గా ఎన్నికైన నూతన కార్యవర్గం మాట్లాడారు. మండ లంలోని జర్నలిస్టులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, వారి హక్కులు, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పాత్రికేయులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## సోమిడిలో వ్యవసాయ మోటర్లు, వైర్ల చోరీ పాల్పడుతున్న గుర్తుతెలియని వ్యక్తులు

### ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని పోలీసులు

### తీవ్ర అవేదనలో వ్యవసాయ రైతులు





**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సోమిడి గ్రామంలో సోమవారం రాత్రి పలువురి రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటర్లు, విద్యుత్ వైర్లు తదితర ఉపకరణాలు గుర్తు తెలియని దుండగులు చోరీ చెయ్యడం జరిగింది.

సమాచారం తెలుసుకున్న పాక్స్ డైరెక్టర్ కాయిత రాజ్ కుమార్ యాదవ్ , బాధిత రైతుల వ్యవసాయ బావులను పరిశీలించి చోరీ జరిగిన తీరును నష్ట తీవ్రతను రైతుల నుండి తెలుసుకోవడం జరిగింది.

**పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలి**

ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ సోమిడిలో గత 6నెలల కాలంలో వరుస దొంగతనాలు జరిగాయని, పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసినప్పటికీ దుండగులను పట్టుకోవడంలో వారు శ్రద్ధ వహించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు

**తీవ్ర అవేదనలో వ్యవసాయ రైతులు**

తీవ్ర వర్షాభావం తో రైతులు ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వరుస దొంగతనాలతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, పోలీసులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి దొంగలను పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేసి బాధిత రైతులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థుల ప్రోత్సాహానికి నారాయణరెడ్డి కృషి అభినందనీయం

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### తల్లి తిరుపతమ్మ స్మరణలో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసిన వంకాయల నారాయణరెడ్డి



**షాద్‌నగర్, అక్షిత ప్రతినిధి:** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి తన మాతృమూర్తి కీ.శే. వంకాయల తిరుపతమ్మ జ్ఞాపకార్థం షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు వంకాయల నారాయణరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తమ తల్లిదండ్రులకు, గురువులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వంకాయల నారాయణరెడ్డి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తిరుపతమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.